సమావేశంలో మాట్లాడుతున్న బిడి.సుధీర్‌రాజ్

మారని టిడ్కో..!

- మౌలిక వసతులు కరువు
- నివాసానికి అనానుకూల వాతావరణం
- ఇళ్లలో చేరాలని లబ్ధిదారులపై ఒత్తిడి

ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వాలని టిడ్కో ఇళ్లు ఇచ్చినా ఉపయోగం లేని పరిస్థితి నెలకొంది. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. ఇళ్లలో చేరాలని లబ్ధిదారులపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. నివాసానికి అనానుకూల వాతావరణం ఉండటంతో లబ్ధిదారులు వాటిలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఆర్బాటంగా కార్యక్రమాలు నిర్వహించింది. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టింది. కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు నగరంలోని జగన్నాథగట్టుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కర్నూలు నగరంలోని జగన్నాథగట్టు వద్ద 10 వేల గృహాల నిర్మాణం చేపట్టారు. ఆ టిడ్కో ఇళ్లను జగనన్న నగర్‌గా నామకరణం చేసి గతంలో అప్పటి మున్సిపల్, ఆర్థిక, కార్మిక శాఖ మంత్రులు ప్రారంభించారు. కర్నూలులో నిర్మించనున్న 10వేల ఇళ్లలో 300 చదరపు అడుగులకు సంబంధించి 3,888 ఇళ్లు, 365 చదరపు అడుగులకు సంబంధించి 19,04 ఇళ్లు, 430 చదరపు అడుగులకు సంబంధించి 4,208 ఇళ్లు నిర్మించనున్నారు. అధికారిక లెక్కల ప్రకారం వాటిలో 4,500 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వాటిని లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని గతంలో మంత్రులు చేపట్టారు. లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్లలోనూ సగానికి పైగా వాటిలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. ఫ్యాన్లు, లైట్లు వంటి పనులు ఇంకా పూర్తి కాలేదు. చాలా వాటికి కిటికీల అద్దాలు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. ఆదోనిలోని సిరిగుప్ప రోడ్డులో 4704 గృహాలను నిర్మించారు. కొన్నింటిలో ఫ్లోరింగ్, మరికొన్నింటిలో పెయింటింగ్, ఇంకా కొన్ని వాటిలో లైట్లు లేవు. 2వ విడతలో మంజూరైన 3500 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన తరువాత ప్రభుత్వం మారడంతో ఆ గృహాలను పూర్తిగా రద్దు చేశారు. టిడ్కో గృహ సముదాయాల పరిసరాల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ఎమ్మిగనూరులో శివన్న నగర్‌లో 2240, మైనార్టీ కాలనీలో 1024 ఇళ్లను ఇప్పటి వరకూ పూర్తి చేశారు. రెండో విడతలో మంజూరైన ఇళ్ల పునాదులకు పరిమితం కాగా మూడో విడతలో మంజూరైన1796 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభమే కాలేదు. మైనార్టీ కాలనీలో నీటి కోసం నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ అసంపూర్తిగా ఉంది. గృహాల మధ్య ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. సిసి రహదారులు పగుళ్లు ఇచ్చి కుంగిపోయాయి.

నంద్యాల జిల్లా పరిధిలో నంద్యాలతో పాటు ఆళ్లగడ్డ, డోన్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నంద్యాలలోని నందమూరి నగర్‌లో 3,904 ఇళ్లు, అయ్యలూరి మెట్ట దగ్గర 2,272 ఇళ్లు, ఎస్‌ఆర్‌బిసి కాలనీలో 3,824 ఇళ్లను నిర్మించారు. ఆళ్లగడ్డలో చింతకుంట గ్రామ శివార్లలో 1,296 ఇళ్లు, డోన్‌లో హైవే సమీపంలో 306 ఇళ్లను కట్టించారు. ఎక్కడా కూడా లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఈ ఇళ్లకు విద్యుత్, మంచినీటి సైకర్యం, రోడ్లు, డ్రైనేజీ వంటివి ఏర్పాటు చేయలేదు. ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పూర్తి అయిన ఇళ్లను కరోనా సమయంలో క్వారంటైన్ కేంద్రాల కోసం ఉపయోగించడంతో ప్రస్తుతం అవి నివాసానికి అనుకూలంగా లేవు. టిడ్కో గృహాలు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. అయితే లబ్ధిదారులు ఇళ్లలో చేరాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. మౌలిక వసతులు లేని ప్రాంతాల్లో ఎలా నివాసం ఉండగలమని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాల పరిస్థితిని మార్చి లబ్ధిదారులకు అనుకూలంగా తయారు చేస్తారా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

అద్దె ఇళ్లే దిక్కు..

ప్రభుత్వం టిడ్కో గృహాల పేరుతో ఇళ్లను కేటాయించినా వాటిలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు వెళ్లకపోవడంతో అద్దె ఇళ్లే దిక్కవుతున్నాయి. నెలకు రూ.4 నుంచి రూ.5 వేల ఇంటి అద్దె కట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరో వైపు టిడ్కో గృహాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా కొందరు లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తుండటంతో ఆయా లబ్ధిదారులకు భారం రెట్టింపవుతోంది.

బాలోత్సవం నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా జి.పుల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా డి.ధనుంజయ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు బాలోత్సవం నూతన కమిటీ ఎన్నికైంది. ఆదివారం కర్నూలు కెకె భవన్‌లో బాలోత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మాంటిస్సోరి పాఠశాలల అధినేత రాజశేఖర్, అధ్యక్షులుగా రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, గౌరవ సలహాదారులు క్లస్టర్ వర్సిటీ డీన్ డాక్టర్ అక్తర్ భాను, కార్యనిర్వాహక అధ్యక్షులుగా జంద్యాల రఘు బాబు, ప్రధాన కార్యదర్శిగా డి.ధనుంజయ ఎన్నికయ్యారు. వీరితో పాటు గౌరవ సలహాదారులుగా లలితా కళాసమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య, ఉపాధ్యక్షులుగా బసవరాజు, రమాదేవి, రమణారెడ్డి, ఖాజా హుస్సేన్, ఆవుల చక్రపాణి యాదవ్, కార్యదర్శులుగా ఎస్ఎం జయరాజు, జి.నవీన్‌పాటి, పిఎస్ఎం రాజు, సాయి ఉదయ్, బిడి సుధీర్‌రాజు, మల్లేశ్వరి ప్రచార కార్యదర్శులుగా ఎల్లాగువేరా, డి.చంద్రమోహన్, కోశాధికారిగా జె.రంగస్వామి ఎన్నికయ్యారు. మరో 20 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. రంగస్వామి ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి డి ధనుంజయ మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం చదువేకాకుండా ఇతర అంశాలపై అసక్తి పెంపొందించేలా కృషి చేస్తున్నామన్నారు. ఇటీవల నిర్వహించిన బాలోత్సవ వేడుకల్లో వేలాది మంది విద్యార్థులు నృత్య, వ్యాసరచన, వక్తృత్వ తదితర పోటీలలో తమ ప్రతిభపాటవాలను చాటారన్నారు. విద్యార్థులను శాస్త్రీయ అంశాలపైన అవగహన కల్పించేందుకు రాబోయే రోజుల్లో కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. జెవివి సీనియర్ నాయకులు డాక్టర్ బడేసాహెబ్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహా, ప్రముఖ అర్థిక నిపుణులు మన్సూర్ రెహమాన్, సిఐటియు జిల్లా నాయకులు బి.రామాంజనేయులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆత్మ రక్షణ అవసరం

-శమంతకమణి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్
-స్పోర్ట్స్ కిట్ ల పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

విద్యార్థులకు చదువుతో పాటు ఆత్మ రక్షణ విద్యలూ అవసరమేనని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నగరూరు శమంతకమణి అన్నారు. ఆదివారం కొండారెడ్డి బురుజు కెఎంసి పార్కులో తైక్వాండో పోటీలను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నగరూరు సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులకు స్పోర్ట్స్ బ్యాగులు, తైక్వాండో టైక్వాండో దుస్తులు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు రోజు వ్యాయామం తప్పనిసరిగా చేయాలని సూచించారు. తైక్వాండో శిక్షకులు టి వెంకటేశ్వర్లు, అజయ్ తేజ, మల్లేష్ విశ్వాస రావు, శ్రీలలిత పాల్గొన్నారు.

కిట్లు అందజేస్తున్న శమంతక మణి

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

12న విజయవాడ యాత్ర జయప్రదం చేయండి

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-పత్తికొండ

ఈనెల 12న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తలపెట్టిన ఉపాధి హామీ సమస్యలపై సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెవి.నారాయణ, సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. ఆదివారం పత్తికొండలో ఈశ్వర్ రెడ్డి భవనంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. కెవి నారాయణ, తదితరులు ఉపాధి హామీ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ బడ్జెట్‌లో కోతలు విధిస్తూ నిధులు మళ్ళిస్తున్నారని విమర్శించారు. పనిచేసిన ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉపాధి కూలీలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దస్తగిరి, నరసన్న ,బూజులు, శికామణి ,తిరుపాలు, నాగభూషణం, షఫీ, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సమాజాన్ని ప్రభావితం చేసిన మహనీయులు

ఎంపిఎం.రెడ్డి, వియోగికి నివాళి

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

ఆధునిక సమాజాన్ని ప్రభావితం చేసిన మహనీయులు డాక్టర్ ఎంపిమద్దిలేటిరెడ్డి, వియోగిలని వక్తలు కొనియాడారు. నగరంలోని సాహితీస్రవంతి కార్యాలయంలో ప్రసిద్ధ సముద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎంపి మద్దిలేటిరెడ్డి, ప్రముఖ రచయిత వియోగిల సంతాప సభ సాహితీస్రవంతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ అధ్యక్షత వహించారు. చిత్రపటాలకు ప్రముఖ కథా రచయిత మారుతి పౌరోహితం, ఆద్యమెడికల్స్ అధినేత అవిజ వెంకటేశ్వర రెడ్డి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వారి సేవలను సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు, ఆదోని డివిజన్ గౌరవాధ్యక్షులు నల్లబోతుల నాగమణి కొనియాడారు. సమావేశంలో డివిజన్ డివిజన్ అధ్యక్షులు ఆవుల బసప్ప, జిల్లా నాయకులు విజయులు తనగల, పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

కరాటే శిక్షణ విద్యార్థులకు ఉపయోగకరం

- డాక్టర్ గోపీనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కరాటే శిక్షణ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపినాథ్‌రెడ్డి అన్నారు. అదివారం జోహరాపురం లోని భవిత ఇంగ్లీష్ మీడియం స్కూలులో సుందరయ్య కరాటే స్కూల్ అధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. సిఐటియూ నగర నాయకులు ఖలీల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపినాథ్‌రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు విజయ రామాంజనేయులు, స్కూల్ కరెస్పాండెంట్ బికె.నరేంద్ర, యూనివర్సిల్ కరాటే మార్షల్‌అర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు టి.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువే కాకుండా క్రీడలపై కూడా అసక్తి పెంపొందించుకోవాలన్నారు. కరాటే శిక్షణ ద్వారా శారీరక దృఢత్వం కలుగుతుందని, శిక్షణను సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఇక్కడ బెల్ట్ గ్రేడింగ్ లో పాల్గొన్న విద్యార్థులు జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను ముఖ్యఅతిథులు అందజేశారు. కరాటే స్కూల్ ప్రిన్సిపల్ సుదాకర్, సిఐటియు నగర నాయకులు సి.నాగరాజు, కెవిపిఎస్ నగర ఆధ్యక్షులు అర్.రమణ, సిఐటియు నగర నాయకులు మాసుమ్, డి.తిప్పన్న, మద్దిలేటి, అబ్దుల్లా, మాబాష, నాగరాజు, యోబు, మైబు పాల్గొన్నారు.

బెల్టులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ముఖ్యఅతిథులు డాక్టర్ గోపినాథ్‌రెడ్డి

పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న నగరపాలక కమిషనర్ రవీంద్ర బాబు

పారిశుధ్యంపై ఫిర్యాదులు రానివ్వొద్దు

నగరపాలక కమిషనర్ రవీంద్ర బాబు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో పారిశుధ్య పనులకు సంబంధించి ఫిర్యాదులకు ఆస్కారం ఇవ్వొద్దని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన ధర్మపేట, స్టేడియం రహదారి, రాజ్ విహార్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చేంత వరకు ఉండొద్దని, దృష్టికి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పూడికతీత పనులను రెండు వారాలకు ఒకసారి తప్పనిసరిగా ప్రతి ఇంటి వద్ద చేపట్టాలన్నారు. ఇందులో జాప్యం తగదని సూచించారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుధ్య తనిఖీదారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఉపాధ్యాయులను రథంలో ఊరేగించి సత్కరించారు.

ప్రజాశక్తి -తుగ్గలి

ఆర్ఎస్ పెండేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో తెలుగు మాస్టర్ హుస్సేన్ సాహెబ్, డ్రాయింగ్ మాస్టర్ గోపాలకృష్ణ శర్మ, గురువులపై ప్రేమ, వాత్సల్యాలు మరువలేనివి పూర్వవిద్యార్థులు తెలిపారు. తల్లిదండ్రుల తరువాత ఉత్తమమైన స్థానం వారిదే. ఆచార్య దేవోభవ అంటూ దైవంతో పోల్చుకుంటాం. అందుకేనేమో 30 సంవత్సరాలైనా జ్ఞానాన్ని ఇచ్చిన ఆ గురువులను పూర్వ విద్యార్థులు మరువలేరన్నారు. వారిని రథంలో ఉరేగించి ఘనంగా సత్కరించారం చేశారు. ఆర్ఎస్ పెండేకల్‌లో10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ఆర్ఎస్ పెండేకల్, ఉన్నత పాఠశాలలో చదివిన సిఐలక్ష్మీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో 1991-92 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేడుకగా నిర్వహించారు. చదువు చెప్పిన గురువులను రథంలో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఆర్ఎస్ పెండేకల్ జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణంలో పూర్వ విద్యార్థులంతా సమావేశమయ్యారు. గౌరవ సలహాదారుడు సుధాకర్ రెడ్డి, గురువులను ఘనంగా సత్కరించారు.

మహనీయుల జీవితాలు స్ఫూర్తి దాయకం

జగ్గర్లపూడి రాజ్యలక్ష్మి, పుల్లయ్యల స్మారక అవార్డు ప్రదానోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమాజ అభివృద్ధికి పాటుపడిన మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని క్లస్టర్‌వర్సిటి మాజీ వైస్‌ఛాన్సలర్ డివిఆర్ సాయిగోపాల్ అన్నారు. అదివారం కర్నూలు నగరంలోని తెలుగుతోటలో జగ్గర్లపూడి రాజ్యలక్ష్మి, పుల్లయ్యల స్మారక అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జగర్లపూడి సీతరామకృష్ణ శర్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ వైస్‌చాన్సలర్ డివిఆర్ సాయిగోపాల్ పాల్గొని మాట్లాడుతూ సమాజంలో విశిష్టసేవలు అందించిన వారికి సత్కరించడం ఎంతో అభినంద నీయమన్నారు. అనంతరం శతావధాని గండూరి దత్తాత్రేయ శర్మకు అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నవ్యాంధ్రరచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతిదేవి, ఎలమర్తి రమణయ్య, సిల్వర్‌జూబ్లికళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గండ్లూరి దత్తాత్రేయ శర్మ, జెఎస్‌ఆర్‌కె శర్మకు అవార్డు ప్రదానం చేస్తున్న నిర్వహకులు

ఉచిత వైద్యశిబిరానికి అనూహ్యస్పందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని 17వ వార్డులోని ఎల్‌బిజి నగర్‌లో ఎపి మెడికల్ సేల్స్‌రెప్రజెంటెటివ్స్‌యూనియన్ అధ్వర్యంలో అదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరానికి ప్రజలనుండి అనూహ్యస్పందన లభించింది. అనేకమంది ఈ శిబిరంలో వైద్యపరీక్షలు చేశారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈవైద్యశిబిరాన్ని కర్నూలు మున్సిపల్‌కమిషనర్ ఎస్ రవీంద్రబాబు ప్రముఖవైద్యురాలు డాక్టర్ సుష్మిత ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరం ద్వారా వైద్యపరీక్షలను నిర్వహించడం అబినందనీయమన్నారు. అకాష్ ఆసుపత్రి సిబ్బంది అధ్వర్యంలో ఈ వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ రెప్స్‌యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు ప్రసాద్‌శర్మ, జిల్లా అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు శివరంగాశంకర్, షెక్షావలి, కోశాధికారి బసవరాజు, ఇతర నాయకులు మారుతి,శేషాద్రి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కోడుమూరులో ఆర్‌విఎస్ జిల్లా మహాసభలు

జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం (ఆర్‌విఎస్) జిల్లా ఆరవ మహాసభలను ఈనెల 22న కోడుమూరు పట్టణంలో నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ తెలిపారు. కోడుమూరు మండల కమిటీ సమావేశం స్థానిక సంత మార్కెట్‌లో ప్రజాసంఘాల కార్యాలయంలో మండల కార్యదర్శి సి.రామలింగప్ప అధ్యక్షతన నిర్వహించారు. సి గురుశేఖర్ మాట్లాడుతూ ఎపి రజక వృత్తిదారుల సంఘం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మండల, పట్టణ, జిల్లా, రాష్ట్ర మహాసభలు నిర్వహించడం సంఘం నిర్మాణంలో ఒక భాగమన్నారు. అందులో భాగంగా జిల్లా ఆరవ మహాసభలు కోడుమూరు పట్టణంలో ఈనెల 22న తుల్జా భవాని దేవాలయంలో ఉదయం 10 గంటలకు మహాసభ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ మహాసభకు జిల్లాలో ఉండే రజక వృత్తిదారులు, మేధావులు ఉద్యోగస్తులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు. స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు పూర్తయినా నేటికి కూడా రజకులు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా ఇప్పటికీ అట్టడుగు స్థాయిలోనే ఉన్నారన్నారు. పెత్తందారులు, భూస్వాముల పెత్తనం కింద రజక వృత్తిదారులు నలిగిపోతున్నారని తెలిపారు. రజకులు గ్రామాల్లో వృత్తి లేక ఉపాధి కొరకు పట్టణాలకు వలసలు పోతున్నారన్నారు. పట్టణాలలో అపార్టుమెంట్ వాచ్మెన్ ఇస్త్రీ దారులుగా, రోడ్ల పక్కన బంకులు ఏర్పాటు చేసుకొని లాండ్రీవృత్తిదారులుగా జీవనం కొనసాగిస్తున్నారన్నారు. కొన్ని అపార్టు మెంట్ల యజమానులు కనీస వేతనం అమలు చేయడానికి కూడా వెనకడుగు వేస్తున్నారన్నారు. రజక వృత్తిదారులను శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. రజక వృత్తిదారులు ఐక్యంగా సమస్యల కోసం అందరం కలిసి ప్రభుత్వల పైన ఒత్తిడి తీసుకురావాలన్నారు. కోడుమూరు మహాసభ నిర్ణయాలను భవిష్యత్తులో జరిగే పోరాటాలకు వేదిక అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలుపరచడంలో 9 నెలల పాలనలో ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. సంఘం జిల్లా కమిటీ సభ్యులు సి.రాముడు, మద్దిలేటి ధర్మన్న, కోడుమూరు మండల నాయకులు సుంకన్న, నాగరాజు, రంగన్న, సూరి, లక్ష్మన్న, శీను, కోడుమూరు మండల వివిధ గ్రామాల రజక వృత్తిదారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌విఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్

కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

యాంటీ ఈవ్ టీజింగ్ బీట్ల తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఈవ్ టీజింగ్, ఆకతాయి పనులకు పాల్పడే వారి పై జిల్లా పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని పోలీసు అధికారులు హెచ్చరించారు. జిల్లాలోని ఆయా పాఠశాలలు, కళాశాలల వద్ద యాంటీ ఈవ్ టీజింగ్ బీట్ లను తనిఖీ చేస్తున్నారు. ఈవ్ టీజింగ్ , ఆకతాయిల వల్ల ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన చేస్తున్నారు. జిల్లా ఎస్పిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత యాంటీ ఈవ్ టీజింగ్‌ను అరికట్టాలనే ఉద్దేశ్యంతో జిల్లా వ్యాప్తంగా ఈవ్ టీజింగ్ బీట్స్ ను కొత్తగా అమలులోకి తీసుకొచ్చారు. వివిధ కళాశాలలు, పాఠశాలల వద్ద ఈవ్ టీజింగ్‌ను అరికట్టడం కోసం ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా 36 ఈవ్ టీజింగ్ బీట్స్ విధులు నిర్వర్తిస్తున్నారు. డ్రోన్ కెమెరాలను కూడా వినియోగిస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఈవ్‌టీజింగ్ పాల్పడే వారిపై నిఘా ఉంచి 2,818 మందిని జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలలో, పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల వద్ద ఈవ్ టీజింగ్ బీట్స్ పోలీసులు కౌన్సిలింగ్ చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్: కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలుంటే ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం పొందాలన్నారు. ఉదయం 10 గంటల నుండి అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నేడు మహాధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలని ఇళ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 10న ఉదయం 10 గంటలకు కర్నూలు కలెక్టరేట్ ముందు నిర్వహించే మహా ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు నగరంలో గత పది సంవత్సరాల నుండి పేద ప్రజలు ఇళ్లస్థలాలు లేక అద్దె కట్టుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులున్నాయన్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు సొంత ఇంటికలను నెరవేర్చడానికి ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. నగరం చుట్టూ అనేక ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ రెవిన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి రాజకీయ నాయకులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు ప్రభుత్వ భూములను దారాదత్తం చేస్తూ పేదలకు ఇళ్ల స్థలాలు లేకుండా చేస్తు న్నార న్నారు. అలాంటి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. పేద ప్రజలు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వాన్ని నిలదీయడానికి కలెక్టరేట్ ముందు మహాధర్నాలో పాల్గొనాలని కోరారు.

రైతు కంట కన్నీరు..!

- సాగుకు రూ.లక్షల్లో పెట్టుబడులు - రోజురోజుకు మార్కెట్‌లో క్షీణిస్తున్న ధరలు
- అయోమయంలో మిరప రైతులు

ప్రజాశక్తి - చిప్పగిరి

రెండేళ్లుగా మిరప రైతు కంట కన్నీరే మిగిలుతోంది. మిరప పంటను సాగు చేసేందుకు రూ.లక్షల్లో పెట్టుబడి అవుతోంది. దిగుబడి వచ్చిన తర్వాత సరైన ధరలు లేక రైతులు ఆవేదన చెందుతున్నారు.

గత రెండేళ్ల క్రితం మిరప పంటకు మంచి ధర పలకడంతో రైతులందరూ అధిక శాతం మిరప పంటను సాగు చేస్తున్నారు. దిగుబడులు ఓ మోస్తరుగా వచ్చినా ధరలు క్షీణిస్తుండడంతో రైతులు అయోమయ స్థితిలో పడ్డారు. మిరప పంటకు ధర వస్తుందన్న ఆశతో ఈ ఏడాది కూడా రైతులందరూ మిరప పంటను సాగు చేశారు. మండలంలో ఎక్కువగా చిప్పగిరి, ఏరూరు, డేగులపాడు, గుమ్మనూరు, కాజీపురం, బెల్డోన, బంటనహాల్, దౌల్తాపురం గ్రామాల్లో మిరప పంటను అధికంగా సాగు చేసినట్లు వ్యవసాయ గణాంకాలు తెలుపుతున్నాయి. మండలం మొత్తం సాగు విస్తీర్ణం 44,162 ఎకరాలు. ఖరీఫ్ సీజన్ సాగు 7,400 ఎకరాలు కాగా, రబీ సీజన్‌లో 36,762 ఎకరాల్లో సాగు చేశారు. ఒక ఎకరా మిరప సాగు చేసేందుకు దాదాపు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి వస్తుందని రైతులు తెలుపుతున్నారు. వ్యవసాయ అధికారులు సూచనలు ఎంత ఆచరించినప్పటికీ మిరప పంటలో తెగుళ్ల వస్తూనే ఉంటాయని, వారానికోసారి తప్పనిసరిగా నీళ్ల మందులు స్ప్రే చేస్తూనే ఉండాలని రైతులు చెబుతున్నారు. ఒక నెలలో మూడు సార్లు నీటి తడులు కట్టాల్సి వస్తుంది. మిరపకాయలు తెంచే కూలిలే దాదాపు రూ.లక్ష వరకు వస్తుందని, వారికి కూడా అప్పులు చేసి చెల్లిస్తున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు తక్కువగా కురవడంతో ఏడాదిగా నీటి తడులు కట్టుకోవడానికి రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. పొలాలు లేని రైతులు కూడా మిరప ధర చూసి కౌలుకు తీసుకొని రూ.లక్షలకు లక్షలు అప్పులు చేసి మిరప పంటలు సాగు చేశారు.

ధరలు తగ్గడంతో చెట్ల కిందనే మిరప నిల్వలు

ధరలు చూస్తే రోజురోజుకు పతనం అవుతుండడంతో కౌలు రైతులకు కంట్లో కన్నీరే మిగిలిన పరిస్థితి దాపురించింది. కొద్ది వరకైనా అమ్ముకుందామని వెళితే మార్కెట్‌లో మిరప ధర పూర్తిగా క్షీణిస్తోంది. తీసుకెళ్లి గిడ్డంగుల భవనాల్లో భద్రపరుస్తున్నారు. ఆ భవనంలో పెట్టేందుకు కూడా దాదాపు రెండు, మూడు రోజులు ఆలస్యం అవుతుందని, రసీదులు తీసుకెళ్తే కూడా భవనాల యజమానులు కిరికిరి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

అప్పుల పాలవుతున్నాం

- లక్ష్మన్న, కౌలు రైతు, చిప్పగిరి

నేను ఆరు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాను. ఒక ఎకరా కౌలు ధర రూ.30 వేలు, పంటను సాగు చేసుకోవడానికి రూ.లక్ష వరకు పెట్టుబడి వస్తుంది. పంట తగ్గినా, ధర అయినా వస్తుందేమోనని ఆశతో ఎదురుచూశాం. రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు బాడిగ రకం కొనుగోలు చేస్తున్నారు. ధరలు ఇలా ఉంటే మేము కూలీలకు కూడా డబ్బులు ఇవ్వలేక, అప్పులు పుట్టక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వాలు స్పందించి గిట్టుబాటు ధర కల్పిస్తే బాగుంటుంది.

సమస్యలు తెలుసుకుంటున్న లక్ష్మన్న

పర్వతాపురంలో ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణ శివారులోని పర్వతాపురం కాలనీలో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కమిటీ సభ్యులు వెంకటేశులు, వీరేష్, శ్రీనివాసులు మాట్లాడారు. పర్వతాపురంలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్య ఉందన్నారు. డ్రెయినేజీ, తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ యువకులు తమ దృష్టికి తెచ్చారని చెప్పారు. ఈ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో పర్యటనలు చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల ముందు ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల

'కూటమి' నిర్లక్ష్యం వీడాలి

- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

యువత పోరు గోడపత్రికలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆలూరు

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వీడాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. ఆదివారం ఆలూరు ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ ఆవరణలో నాయకులు, కార్యకర్తలతో కలిసి యువత పోరు గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక వాగ్దానాలు చేసిందని, అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. అధికారం చేపట్టగానే పెండింగ్‌లో ఉన్న రూ.4,600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా చెల్లిస్తామని.. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని.. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మెడికల్ కళాశాల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 12న రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న యువత పోరులో భాగంగా విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి ఆయా జిల్లా కలెక్టరేట్లలో కలెక్టర్లకు వినతిపత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున్న పాల్గొనాలని కోరారు. వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, కో కన్వీనర్ వీరేష్, నాయకులు భాస్కర్, రామ్ గోపాల్, జె.వీరేష్, వెంకటేష్, బాబు పాల్గొన్నారు.

దళిత కాలనీకి తాగునీరు

- వైస్ ఎంపిపి బుజ్జి స్వామి

ప్రజాశక్తి - కౌతాళం

పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మండలంలోని కాత్రికి గ్రామంలో దళిత కాలనీకి తాగునీరు అందిస్తామని వైస్ ఎంపిపి బుజ్జి స్వామి తెలిపారు. ఆదివారం పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి సహకారంతో పైపులైన్ పనులకు రూ.6 లక్షలు మండల పరిషత్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కాత్రికి గ్రామంలో దళిత కాలనీలో తాగునీటి సమస్య ఉందని స్థానిక నాయకులు ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. ఆయన ఆదేశాల మేరకు పైపులైన్ పనులను వేగవంతం చేసి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని వివరించారు. సర్పంచి ఎం.కన్న, ఎంపిటిసి వసంత, పొదలకుంట ఎంపిటిసి మూకన్న, వైసిపి నాయకులు మారెప్ప పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

- 185 మంది హాజరు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో అవోపా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో శాంతిరాం హాస్పిటల్ (నంద్యాల), ఎన్‌టిఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) సహకారంతో ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ వారి సౌజన్యంతో సాయిభారతి స్కూల్‌లో ఆదివారం 'ఉచిత కంటి వైద్య శిబిరం' నిర్వహించారు. ఈ శిబిరానికి 185 మంది రోగులు హాజరయ్యారు. 68 మంది రోగులు ఉచిత కంటి ఆపరేషన్‌కు ఎంపికై నంద్యాలకు కంటి ఆపరేషన్ నిమిత్తం వెళ్లారని అవోపా పట్టణ ప్రెసిడెంట్ వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. అవసరమైన ప్రతి ఒక్కరికీ కంటి శుక్లాన్ని ఉచితంగా అమర్చి.. అక్కడ ఆస్పత్రిలో రోగులు ఉండడానికి కావాల్సిన ఆహార, వసతి సౌకర్యాలను ఉచితంగా కల్పించినట్లు తెలిపారు. ఆదోని, నంద్యాల రానుపోను రవాణా సౌకర్యం ఉచితంగా కల్పించి రోగులకు ఖర్చు కాకుండా ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. ఖరీదైన వైద్యానికి నోచుకోని ఎంతో మందికి దారి చూపి కంటిచూపు కలిగించడంలో సఫలీకృతులు అయినందుకు తమకెంతో ఆనందంగా ఉందని తెలిపారు. అవోపా పట్టణ కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్న శెట్టి, సభ్యులు వెంకటేష్ బాబు, రాజేష్, రాధాకృష్ణ, అవోపా మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతాశ్రీ, సభ్యులు అనిత, సంతోషి, మీనాక్షి ఉన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గలవారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. జీవనోపాధికి వారు చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

చిప్పగిరి పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ

సిబ్బంది నిర్లక్ష్యం.. పసికందు మృతి

- ప్రభుత్వాస్పత్రిలో బాధితుల ఆందోళన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వాస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కళ్లు తెరవకముందే పురిటిలోనే పసికందు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఆదివారం పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన సువార్తమ్మ (ప్రశాంతి) పురిటి నొప్పులతో ప్రభుత్వాస్పత్రిలో చేరారు. అక్కడ ఉన్న డాక్టర్లు, నర్సులు సువార్తమ్మ (ప్రశాంతి)కు వైద్య పరీక్షలు నిర్వహించి బాగుందని చెప్పారు. 11 గంటల సమయంలో ప్రసవం అయ్యారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రసవ సమయంలో పసికందు (బాలుడు) మృతి చెందాడు.

మృతి చెందిన పసికందు

డెలివరీకి సంబంధించి కుటుంబ సభ్యులు, పసికందు మృతి చెందడాన్ని ప్రశ్నించగా ఆస్పత్రి సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడారని బాధితులు వాపోయారు. పసికందు తండ్రి నరసింహ, బంధువు అడ్వకేట్ తిమ్మప్ప, యువజన సంఘ నాయకులు సురేష్ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే బాలుడు మృతి చెందాడని ఆస్పత్రిలో ఆందోళన చేపట్టారు. సామాన్యులకు అందుబాటులో వైద్యం లేనట్టు చేస్తున్నారని, వైద్యం కోసం వచ్చిన వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న బాధితులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత ఎంసెట్ కోచింగ్

- జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని

ఇంటర్ ఎంపిసి పూర్తయిన విద్యార్థులకు ఈనెల 17 నుంచి ఉచిత ఎంసెట్ కోచింగ్ ఇస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఆదోని గ్రామీణ పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఈనెల 17 నుంచి ఏప్రిల్ 25వ వరకు దాదాపు 33 రోజుల పాటు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత ఎంసెట్ కోచింగ్ ఉంటుందని తెలిపారు. పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కోచింగ్ పూర్తిగా ఉచితమని, ఆదోని పట్టణంలోని విశ్వ నారాయణ జూనియర్ కళాశాలలో కోచింగ్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 9052166745, 9515291609 ఫోన్ నెంబర్లకు సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో కౌన్సిలర్ మృతి

ప్రజాశక్తి - ఆదోని

రామలక్ష్మమ్మ (ఫైల్)

పట్టణంలోని 24వ వార్డు కల్లుబావికి చెందిన కౌన్సిలర్ రామలక్ష్మమ్మ (70) అనారోగ్యంతో మృతి చెందినట్లు బంధువులు ఆదివారం తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆమెను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందారని తెలిపారు. ఆమె మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, ఫయాజ్ అహ్మద్‌లు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టిడిపితోనే బీసీలకు పెద్దపీట

- తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షులు మేకల రవి యాదవ్

ప్రజాశక్తి - చిప్పగిరి

బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటూ.. బీసీలకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షులు మేకల రవి యాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కోటా కింద యాదవులకు సముచిత స్థానం కల్పిస్తూ బీద రవిచంద్ర యాదవ్‌ను ఎన్నుకోవడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లాకు చెందిన వాల్మీకి వర్గానికి చెందిన బిటి.నాయుడును ఎమ్మెల్సీగా ఎంపిక చేయడంతో బీసీలకు ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నారనేది ప్రతి ఒక్కరికీ తెలుసని అన్నారు. టిడిపి అంటేనే బీసీల పార్టీ అని, బీసీలకు మంత్రి పదవుల్లో, నామినేటెడ్ పోస్టుల్లో ఒక గౌరవమైన స్థానం కల్పిస్తున్న ఏకైక పార్టీ టిడిపి అని తెలిపారు.

సక్రమంగా హాజరు రాని దంత వైద్యుడు

- రోగులు లబోదిబో...

ప్రజాశక్తి- పత్తికొండ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో పనిచేస్తుంది. కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు , మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఉద్దేశంతోనే డాక్టర్లను, సిబ్బందిని నియమించింది. డివిజన్ కేంద్రమైన పత్తికొండలో ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రోగులకు సేవలు అందించే దంత వైద్యుడు సక్రమంగా హాజరు కావడం లేదంటూ ప్రజలు , రోగులు బహిరంగానే చర్చించుకుంటున్నారు. దంత వైద్యుడు ఆడిందే ఆట పాడిందే పాటగా ఉందని సిబ్బంది మొరాయిస్తున్నారు. ఆస్పత్రిలోని పట్టణ, గ్రామీణ ప్రాంత రోగులకు ప్రతిరోజు సుమారు 600మంది వివిధ రకాల వైద్య సేవలు అందుతున్నాయి. సేవలందించాల్సిన డాక్టరే ఇలా చేస్తే, సేవలు ఎలా అందుతాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం హసీనా పళ్ళు నొప్పి ఉండడంతో చికిత్స కోసం దంత వైద్యుడిని సంప్రదించాలని వస్తే లేకపోవడంతో డ్యూటీలో ఉన్న డాక్టర్ దగ్గర చికిత్స తీసుకొని ఇంటికి వెళ్ళింది. సమయపాలన పాటించని ఆ డాక్టర్ పై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూద్దాం. ఈ విషయంపై ప్రభుత్వ ఆస్పత్రి సూపరిండెంట్ వివరణ కోసం సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

మా వీధిలో మురుగు తొలగించరా.. సారూ..!

ప్రజాశక్తి - సి బెళగల్

'మా వీధిలో రోడ్లపైనే మురుగు ప్రవహిస్తోంది. చర్యలు చేపట్టి తొలగించరా సారూ' అంటూ పోలకల్‌లోని స్పెషల్ స్కూల్ సమీపంలో గల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా సిసి రోడ్డు ఉన్నప్పటికీ పాత దాని కన్నా కొత్త సిసి రోడ్డు ఎత్తుగా ఉండడంతో మురుగు నీరు నిలుస్తోందని వాపోతున్నారు. నీరు నిలిచి దుర్గంధం వస్తోందని, పందులకు ఆవాసంగా మారిందని తెలిపారు. దోమలు వృద్ధి చెంది ఇళ్లపైకి దాడి చేస్తున్నాయని వాపోతున్నారు. కొత్తగా సిసి రోడ్డు వేయాలని వేడుకొంటున్నారు.

సర్వేలతో పని ఒత్తిడి

- 'కూటమి'లో సచివాలయ వ్యవస్థలో పెనుమార్పులు
- టార్గెట్లపై ఉద్యోగులు ఫైర్..!

ప్రజాశక్తి - ఆదోని

సర్వేల పేరుతో సచివాలయ ఉద్యోగులను అధికారులు పని ఒత్తిడికి గురి చేస్తున్నారు. అధికారులు తమపై కక్ష సాధింపు ధోరణి అవలంభిస్తున్నారని సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు. రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థలో కూటమి ప్రభుత్వం పెను మార్పులు చేస్తోంది. తాజాగా హేతుబద్ధీకరణ పేరుతో సచివాలయాలు, వాటి సిబ్బందిలో మార్పులు, చేర్పులు చోటు చేసుకుంటున్నాయి. దీని వల్ల ఉద్యోగులకు మేలు జరుగుతుందా అంటే కచ్చితంగా అవునని చెప్పలేని పరిస్థితి. అదే సమయంలో ఉన్నతాధికారుల వేధింపులపై సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ గవర్నమెంట్' నినాదానికి తూట్లు పొడుస్తూ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను ఒత్తిడికి గురి చేస్తూ, వేధిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వార్డు ప్లానింగ్ సెక్రటరీల సంఘం నాయకులు విమర్శిస్తున్నారు. ఆదివారాలు, పండగ రోజుల్లో సెలవు ఇవ్వాల్సిందేనని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎం.రాజు, జిల్లా అధ్యక్షులు రవికిరణ్, సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతయ్య డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం లేదా సెలవు రోజున ఒకటో తేదీ వచ్చిన సందర్భంలో ఒకరోజు ముందుగా ఉద్యోగులకు ఇబ్బంది కలుగకుండా సామాజిక పింఛను పంపిణీ చేయిస్తున్నారని, ఇలాంటి సందర్భంలో క్షేత్ర స్థాయి అధికారులు వివిధ రకాల సర్వేల పేరిట సమయపాలన లేకుండా టార్గెట్లు విధించి సచివాలయ ఉద్యోగులను మానసిక ఒత్తిడికి గురిచేస్తూ వేధిస్తున్నారని వారు పేర్కొంటున్నారు. సెలవులు, ఆదివారాలు, పండగ రోజులతో సంబంధం లేకుండా ప్రతి పనికీ టార్గెట్లు విధిస్తూ ఉద్యోగులను కుటుంబ జీవితానికి దూరం చేస్తున్నట్లు చెబుతున్నారు. సర్వేల టార్గెట్లు, పన్ను వసూళ్ల టార్గెట్లతో ఉద్యోగులు భయాందోళనకు, తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. వివిధ సర్వేల కోసం పదే పదే ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయంలో ప్రజల నుంచి పూర్తిస్థాయిలో సహకారం లభించకపోగా, ఒటిపిలు చెప్పడానికి నిరాకరిస్తున్నారని వారు వెల్లడించారు. అలాగే ఈ సర్వేల వల్ల తమకు ఎటువంటి ఉపయోగం ఉండదని, తమకు అవసరం లేదని, ఈ మధ్యనే వచ్చారు కదా మళ్లీ ఎన్నిసార్లు వస్తారని రకరకాలుగా ప్రజల నుంచి ఇబ్బందులు తలెత్తున్నాయని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో వారిని ఒప్పించడం చాలా కష్టతరమవుతోందని చెబుతున్నారు. ఒక వైపు అధికారుల ఒత్తిడి, మరోవైపు ప్రజల నుంచి అరకొర సహకారం ఉంటోందన్నారు. లక్ష్యం చేరుకోక అయోమయానికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే అధికారులు సచివాలయం పరిధి నుంచి మండల, మున్సిపాలిటీ, జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతి పనికీ ర్యాంకింగ్‌ల పేరిట సచివాలయ ఉద్యోగులను తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నారని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ గవర్నమెంట్'లో ఉద్యోగులు ప్రశాంతంగా హార్డ్ వర్క్ కాకుండా స్మార్ట్ వర్క్ చేయాలని, ఉద్యోగులకు కార్యాలయ పనివేళలు కానీ సమయాల్లో టెలీ, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించవద్దని ఓవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగా చెబుతున్నారని, క్షేత్రస్థాయిలో అధికారులు ఈ ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల శాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడిని తగ్గించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నారు.

పని ఒత్తిడికి గురవుతున్నాం

- ఎం.రవికుమార్, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్

మాకు కేటాయించిన విధులతోపాటు వివిధ సర్వేలతో సతమతమవుతూ పని ఒత్తిడికి గురవుతున్నాం. అధికారంలోకి వస్తే పని భారం తగ్గిస్తామని చెప్పినా.. గతంలో మాదిరిగానే సర్వేలు చేయిస్తున్నారు. వాలంటీర్లు ఉండడం వల్ల సూపర్‌వైజర్ ఉండేవారు. ప్రస్తుతం మేమే క్షేత్రస్థాయిలోకి వెళ్లి వివరాలు సేకరించాల్సి ఉంది. ప్రజల నుంచి సమాచారం రాక ఇబ్బందులకు గురవుతున్నాం. మహిళా ఉద్యోగులు ఒంటరిగా వెళ్లలేక అభద్రత భావానికి గురవుతున్నారు. రోజువారీగా రిపోర్టులు సమర్పించలేక పని ఒత్తిడికి గురవుతున్నారు. సచివాలయ ఉద్యోగుల పట్ల అధికారుల వైఖరి మారాలి. మా సమస్యలపై ఇప్పటికే ఉన్నతాధికారులను కలిసినా మార్పు రాలేదు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి స్పందించాలి. ఇతర ఉద్యోగుల మాదిరిగా గౌరవం పెంచాలి.

ఘనంగా శ్రీమంగమాంబ దేవి రథోత్సవం

- తరలి వచ్చిన భక్త జనం..

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని కరిడిగుడ్డం, కమ్మరచేడు గ్రామాల్లో వెలసిన శ్రీమహా యోగి మంగమాంబ దేవి రథోత్సవం ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో రమణీయంగా సాగింది. ఉదయం అమ్మవారికి గంగిపూజ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. మంగమాంబ దేవి రథోత్సవం సందర్భంగా ఆంధ్ర, కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం వేలాది మంది భక్తుల నడుమ మంగమాంబ దేవి రథోత్సవం ఎదురు బసవన్న గుడి వరకు వైభవంగా నిర్వహించారు. అన్నదానం, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి, జడ్‌పిటిసి ఏరూరు శేఖర్, సర్పంచులు సుధాకర్ రెడ్డి, సుమతి రెడ్డి, దేవి రెడ్డి, కురువ దేవేంద్రప్ప, చంద్రశేఖర్ రెడ్డి, ఆరోగ్య స్వామి, సురేష్ యాదవ్, తిమప్ప, అబ్రహాం, భీమలింగ పాల్గొన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


ఎమ్మెల్యే డాక్టర్ బీవీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాటికాపరుల సమస్యలపై

అసెంబ్లీలో చర్చించండి

- ఎమ్మెల్యే బీవీకి నాయకుల వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కాటికాపరుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి నివాసం వద్ద ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. శ్మశానంలో గుంతలు తీసి పూడ్చే, కట్టెలు పేర్చి కాల్చే కాటికాపరుల సమస్యపై ఎమ్మెల్యే బీవీకి వివరించారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వమూ కాటికాపరుల సమస్యపై స్పందించలేదని, మీరైనా స్పందించి కాటికాపరుల సంక్షేమానికి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ... ఈ సమస్యపై ఇప్పటి వరకు ఏ సంఘమూ అడగలేదని, ఇది వాస్తవమైన సమస్య అని తెలిపారు. కాటికాపరుల సమస్యపై అసెంబ్లీలో మాట్లాడేందుకు ప్రయత్నిస్తానని, సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాటికాపరుల సంఘం నాయకులు లక్ష్మన్న, మల్లికార్జున, కన్నయ్య, వనములయ్య, రాముడు, తిమ్మప్ప, నాగరాజు, శంకర్‌తో పాటు మరో 10 మంది పాల్గొన్నారు.

కనుల పండువగా సుబ్బారుడా రథోత్సవం

ప్రజాశక్తి - కోసిగి

స్థానిక రంగప్ప గట్టు వద్ద వెలసిన గురు సుబ్బారుడా రథోత్సవం ఆదివారం అశేష జనవాహిని మధ్య.. కనుల పండువగా సాగింది. ఆలయ కార్యదర్శులు మఠం చంద్రప్ప, బొంబాయి దయా, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం నుంచి ఫల, పుష్ప అలంకరణ వంటి ప్రత్యేక పూజలు చేశారు. 62వ రథోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచి మల్లికార్జున స్వామి వారికి, గురు సుబ్బారుడా స్వాముల స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫల, పుష్ప అలంకరణ, వెండి కవచ అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయం నుంచి పెండేకల్లు ఆంజనేయస్వామి దేవాలయం వరకు పల్లకి ఉత్సవం నిర్వహించి, ఉత్సవమూర్తిని మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగించారు. అనంతరం రథోత్సవం లాగారు. రథోత్సవం తర్వాత భవిష్య వాణి భక్తులకు వినిపించారు. ఆలయ ప్రాంగణంలో గురుపూజ, అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివార్లను టిడిపి, వైసిపి నాయకులు దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అశేష జనవాహిని మధ్య లాగుతున్న రథోత్సవం